


31న మన్యం బంద్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ ఈనెల 31న తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ తెలిపారు. బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చుతామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడమంటే గిరిజనుల హక్కులను హరించడమేనని అన్నారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఉన్న జీవోలు నిర్వీర్యం చేస్తూ గిరిజనుల పట్ల వివక్షత చూపుతుందని విమర్శించారు. జిఒ 3, 1/70 చట్టం, అటవీ హక్కులు, సీసా చట్టం పటిష్టంగా అమలు చేసి గిరిజన హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. మన్యం బంద్‌లో గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర


ప్రజాశక్తి - పాచిపెంట

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన వై.ఎస్.ఆర్.ఆసరా కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ ఆసరా, జగనన్న చేయూత తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ మహిళల ఆర్థిక ప్రగతికి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అనేక మంది మహిళలు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని, కొంత మంది గొర్రెలను కొనుగోలు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకున్నారని తెలిపారు. కుటుంబాలను ఆర్థికంగా ముందుకు నడిపించడం వల్ల అన్ని రంగాల్లో ప్రగతి వస్తుందన్నారు. వైఎస్.ర్ ఆసరా కార్యక్రమం కింద మూడో విడత సాలూరు నియోజక వర్గంలో 3585 సంఘాలకు చెందిన మహిళకు రూ.16.64 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మహిళల స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని చర్యలు చేపడుతున్నామ న్నారు. డిఆర్‌డిఎ నేతృత్వంలో మహిళా మార్టు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, ఎంపిపి జి.ప్రమీలా, వైసిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయడు, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, ఎపిఎం సత్యనారాయణ, పలువురు ఎంపిటిసిసభ్యులు, సర్పంచులు, అధికార, అనధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు పరిశీలించిన కలెక్టర్

విశాఖ - రాయపూర్ జాతీయ రహదారి పనులను కలెక్టర్ నిశాంత్ కుమార్ పాచిపెంట వద్ద సోమ వారం పరిశీలించారు. జాతీయ రహదారి అధికారులు పనుల ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

కురుపాం : మండల కేంద్రంలో ఎపిఎం ఇ.వెంకట కిషోర్ ఆధ్వర్యంలో మూడో విడత ఆసరా చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంలో తమ ప్రభుత్వం ముందుందన్నారు. అనంతరం 624 మహిళా సంఘాల గ్రూపులకు ఆసరా పథకం చెక్కులు, 112 మహిళా సంఘాల గ్రూపులకు వైయస్సార్ సున్న వడ్డీ బ్యాంక్ లింకేజీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, వైస్ ఎంపిపిలు రంగారావు, అన్నాజీరావు, ఎంపిటిసి సభ్యులు వి.బంగారునాయుడు , టీవీఎస్ స్వామియోజులు, జి. విద్యారాణి, సంతోషిని, మాజీ ఎంపిపి ఎ.ఇంద్రిరకుమారి, కలింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్. వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గౌరీశంకర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర


చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

29న ఆసరా చెక్కులు పంపిణీ

బలిజిపేట : మండలంలోని వెంగాపురంలో ఈనెల 29న వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే ఎ.జోగారావు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు ఎంపిడిఒ ఎ.భానుమూర్తి తెలిపారు. ఈ మేరకు సభ సన్నాహక సమావేశం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఆసరా చెక్కుల పంపిణీ సభను జయప్రద చేసేలా అన్నిశాఖల అధికారులు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎస్.రవికుమార్, ఎపిఎం కె.ఉమామహేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామైక సంఘాల సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు.

29న వైయస్సార్ అసరా కానుక పంపిణీ

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 29న వైయస్సార్ అసరా కానుక పంపిణీ కార్యక్రమం చేయనున్నట్లు ఎపిఎం జి.శివున్నాయుడు సోమవారం తెలిపారు. మండలంలోని 1379 సంఘాలకు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.


రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఏజెన్సీలో భారీ వర్షం

రోడ్డుపై విరిగి పడిన భారీ వృక్షం • నిలిచిన ట్రాఫిక్

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో సోమవారం సాయంత్రం భారీ వర్షం పడింది. వర్షంతో పాటు భారీ ఈదురుగాలు వీయడంతో మండ గ్రామ సచివాలయం సమీపాన రోడ్డు పక్కనే ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. బీభత్సమైన గాలులు వీచిన నేపథ్యంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో గంటన్నర పాటు రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. కురుపాంలో డిగ్రీ పరీక్షలు రాసి గుమ్మలక్ష్మీపురం స్వగ్రామానికి వస్తున్న కొంతమంది విద్యార్థులు చిన్నచిన్న చెట్టు కొమ్మలను తొలగించి ద్విచక్ర వాహనాలకు తోవ ఇచ్చారు. దీంతో ద్విచక్ర వాహనాలకు మార్గం సుగమయింది. అయితే గుమ్మలక్ష్మీపురం నుండి కురుపాం, పార్వతీపురం వెళ్లే బస్సులు, భారీ వాహనాలు మాత్రం గంటన్నర పాటు నిలిచిపోయాయి. దీంతో మండ గ్రామస్తులు స్పందించి గొడ్డల్లు, కత్తులు పట్టుకొని భారీ వృక్షాన్ని కొంతమేరకు తొలగించారు. దీంతో కురుపాం, పార్వతీపురం వెళ్లే ఆర్టీసీ బస్సులు రోడ్డు పక్క నుంచి మార్గం చేసుకొని వెళ్లాయి. ఇదిలా ఉండగా, ప్రతిరోజు భారీ గాలులతో కూడిన వర్షం వస్తున్న నేపథ్యంలో విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతుఆన్నరు.

కురుపాం : కురుపాం పరిసర గిరిజన ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా పెరిగిన ఎండలు, కరెంటు కోతలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్న సమయంలో ఇలా వర్షం కురవడంతో కొంత ఉపశమనం లభించింది.

బండరాయి పడి
ఇద్దరు గిరిజనులు మృతి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కొత్తవలస సమీపాన గల విద్యాస్టోన్ క్వారీలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. క్వారీలో పేలుళ్ల కోసం ఏర్పాట్లు చేస్తుండగా భారీ వర్షం పడింది. దీంతో అక్కడ నుంచి కిందకి వచ్చిన ముగ్గురు కార్మికులు సామాగ్రిని తీసుకుని రావడానికి క్వారీ పైకి వెళ్ళారు. ఈలోగా వర్షానికి బాగా తడిసిన బండరాయి దొర్లి వీరి మీదకు రావడంతో సోమ, సుజిత్ అనే కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో కార్మికుడి భుజానికి తీవ్ర గాయమైంది. ఒడిశాలోని మల్కన్ గిరి ప్రాంతానికి చెందిన ఐదుగురు గిరిజనులు ఉపాధి కోసం వలస వచ్చి క్వారీ పనుల్లో ఆదివారం చేరారు. రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి సంఘటనాస్థలానికి చేరి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై ఆయన మాట్లాడుతూ ఒడిశాకు చెందిన ఐదుగురు కార్మికులు ఆదివారం విధుల్లో చేరారని, ప్రమాదానికి గురై ఇద్దరు మృతి చెందారని తెలిపారు ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్లు చెప్పారు.


సోమ


సుజిత్

ఉత్తరాంధ్రలో శాంతిభద్రతలు ప్రశాంతం : డిఐజి

ప్రజాశక్తి -సీతానగరం

ఉత్తరాంధ్ర జిల్లాల్లో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉన్నాయని విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషనును సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 8మండలాల్లో 2021లో సుమారు 7,500 ఎకరాల్లోని గంజాయి పంటలను గుర్తించి దగ్ధం చేసినట్లు చెప్పారు. గతఏడాది కూడా దాడులు నిర్వహించి చాలాప్రాంతాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా ఆయా మండలాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను గిరిజనులకు చూపిస్తూ, ప్రత్యామ్నాయ పంటలసాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గంజాయి రవాణాపై విస్తతంగా నిఘాలు పెంచి పెద్దఎత్తున కేసులు కూడా నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఒడిశాలో గంజాయి సాగు వల్ల మనవైపు అక్రమంగా రవాణా జరగడంతో పోలీసుల ముమ్మర తనిఖీల వల్ల ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. మరోఏడాదిలో పూర్తిగా గంజాయి రవాణా నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పెద్దఎత్తున నిఘా పెంచి గంజాయి సాగును, రవాణాను అరికడుతున్నట్టు తెలిపారు. గిరిజనులు కూడా గంజాయి పంటల సాగుకు స్వస్తి పలికి కాఫీ వంటి పంటల సాగుపై దృష్టి పెట్టారని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నక్సల్ ప్రభావితం పూర్తిగా లేదని ఆయన చెప్పారు. పలు పోలీస్ స్టేషన్ల మరమ్మతులు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాల గురించి పోలీస్ కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటిసారిగా విచ్చేసిన డిఐజి హరికృష్ణకు పోలీసులు గౌరవ వందనం చేశారు. డిఐజి వెంట ఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, డిఎస్‌పి ఎ.సుభాష్, ఎస్‌బి సిఐ శ్రీనివాసరావు, సిఐలు విజయానంద్, కృష్ణారావు, సీతానగరం, బలిజిపేట ఎస్ఐలు నీలకంఠం, ప్రశాంత్ కుమార్, ఎఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.


పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న డిఐజి హరికృష్ణ

గిరిజన వైద్యానికి అధిక ప్రాధాన్యత

104 వాహనాలను ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

గిరిజనుల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విఆర్ఎస్ క్వార్టర్స్ ఆవరణలో 104వాహనాలను ఆయన కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కొత్తగా మంజూరైన 104 వాహనాలను ప్రారంభించడం గొప్ప విషయమని అన్నారు. సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ కాన్సెప్ట్ ప్రవేశ పెట్టారని చెప్పారు. 104 వాహనాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఫ్యామిలీ కాన్సెప్ట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ జగన్నాథరావు, మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు మున్సిపల్ కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఏప్రిల్ 3నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండలం నుంచి 668 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఎంఇఒ కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. మండలంలోని నీలానగరం, బిటివాడ, గంగంపేట, వీరఘట్టంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.


సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పోటెత్తిన వినతులు

ప్రజాశక్తి కలెక్టరేట్

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు పోటెత్తాయి. ఈ వారం 110 వినతుల అందాయి. ఈ వినతులను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ స్వీకరించారు. వచ్చిన వినతుల్లో కొన్ని....

నాలుగేళ్ల కిందట తాము నిర్మించిన గోకులాలకు సగం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీతానగరం మండలం కాశయ్యపేట గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారు. పార్వతిపురం మండలం వెంకంపేటలో సర్వేనెంబర్ 22-2 లో తన ఇరవై సెంట్లు భూమికి అడంగల్, వన్ -బి, ఎస్ఎఫ్ఎ రికార్డులన్నీ ఉన్నప్పటికీ తన కుటుంబీకులైన తీళ్ల నారాయణరావు, అతను కుటుంబ సభ్యులు తన పొలాన్ని ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నారని, ఇప్పటికైనా తన వద్దనున్న భూ రికార్డులను పరిశీలించి తన పొలాన్ని తానుకు ఇప్పించాల్సిందిగా తీళ్ల గౌరీశంకర్రావు అర్జీ పెట్టుకున్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లి భద్రకు చెందిన రొబ్బి మణికంఠ ఇప్పటికే తనకు ప్రభుత్వం మంజూరు చేసిన సదరం ధ్రువపత్రాన్ని రద్దు చేయాలనికోరారు. పార్వతీపురం మండలం పెదమరికికి చెందిన శ్రీ సత్యసాయి మహిళా సంఘం సభ్యులు 11 మందికి గాను గత మూడు విడతలుగా ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా డబ్బులు జమ కాలేదని అర్జీ పెట్టుకున్నారు. పెదమరికి సర్పంచ్ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు, యువకులు వినతిని అందజేశారు. జియమ్మవలస మండలం డంగభద్రలో అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వడంలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వెంగళరావు ప్రాజెక్టు ముంపుడు భూములను 1984లో ప్రభుత్వం కొనుగోలు చేసినా ఇప్పటి వరకు వెబ్‌లాండ్‌లో సర్వేనెంబర్లను డిలీట్ చేయకపోవడంతో ఆ.భూములు అమ్మకాలు, కొనుగోలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి వికాస్ పరిషత్ నాయకులు మజ్జి నారాయణ రావు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు మరిన్ని వినతులు అందజేశారు. కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 35 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు కార్యక్రమంలో 35 వినతలు వచ్చాయి. ఎపిఒ రోషిరెడ్డి వినతులను స్వీకరించారు. అంటికొండకు చెందిన నిమ్మక సుందరరావు జీడి పటకు నష్టపరిహారం చెల్లించాలని వినతి సమర్పించారు. జల్లార గూడకు చెందిన సవర సంగీత సిహెచ్ డబ్ల్యూఒ పోస్టు మంజూరు చేయాలని కోరారు. సంకిలికి చెందిన మల్లేశ్వరరావు సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కుసుమూరుకు చెందిన పద్మావతి పాలు ప్యాకెట్లు మంజూరు చేయాలని, లోవ గూడా కాలనీకి చెందిన సవర సుందరరావు విద్యుత్ బోరు మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో జిసిసి డిఎం సంధ్యారాణి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్, ఎఎంఒ పి.కోటిబాబు, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి గృహ నిర్మాణాలు పూర్తి : పిఒ

ప్రజాశక్తి - మక్కువ

ఏప్రిల్ 15నాటికి ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పిఒ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. లబ్దిదారులను మోటివేట్ చేయాలని, త్వరగా నిర్మాణాలు చేసేందుకు అన్ని విధాలా సహకరించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్ పనులు మంజూరు చేసిన మేరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. వచ్చే మూడు వారాల్లో అన్ని గృహాలు పూర్తి కావాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి రావాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపిడిఒ దేవకుమార్, తహశీల్దార్ సూర్యనారాయణ, హౌసింగ్ ఎఇ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రావతి

గురుకులంలో ఘర్షణ

పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పిఎన్ బొడ్డువలస బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య తలెత్తిన స్వల్ప ఘర్షణ కలకలం రేపింది. గురువారం పాఠశాలలో వాలీబాల్ ఆడుతుండగా ఆరో తరగతి విద్యార్థి హర్షవర్ధన్, ఇంటర్ విద్యార్థి మధు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో విద్యార్థి హర్షవర్ధన్‌ను ఇంటర్ విద్యార్థి మధు కొట్టాడు. దీంతో హర్షవర్ధన్ తన సొంత ఊరిలో బంధువులకు కొట్టిన విషయం చెప్పాడు. దీంతో వారు ఆదివారం పాఠశాలలోకి చొరబడి ఇంటర్ విద్యార్థి మధును కొట్టడంతో ఘర్షణ జరిగింది. దీనిలో కొంతమంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కోఆర్డినేటర్ చంద్రావతి సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఘటనపై పాఠశాలలో ప్రిన్సిపల్ వి.శ్రీరాములు నాయుడు, ఉపాధ్యాయులను ఆమె విచారించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె ఆదేశించారు.


దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహనరావు

ఎంఇఒపై చర్యలకు ఉపాధ్యాయుల దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గిరిజన, మహిళ ఉపాధ్యాయులపై వివక్షత చూపించడమే కాకుండా వారిపై అనుచితంగా ప్రవర్తిస్తున్న స్థానిక ఎంఇఒ పివి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ఎంఇఒగా ప్రసాద్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఉపాధ్యాయులపై కక్ష సాధింపులు, వేధింపులు, వివక్ష చూపు తున్నారని అన్నారు. ఈ విషయమై అనేకసార్లు పై అధికారులకు తెలిపినా ఎలాంటి చర్యలు లేవన్నారు. గిరిజన ఉపాధ్యాయులు, మర్రి రాము, కోలక భాగ్యవతి సమస్యలు పరిష్క రించకుండా వివక్షత చూపుతున్నారని, మహిళా ఉపాధ్యాయులని చూడకుండా దుర్భాషలాడు తున్నారని అన్నారు. ఈ రోజు దీక్షలు ఆరంభం మాత్రమేనని, ఎంఇఒపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని జిల్లా అధ్యక్షులు తోట రమేష్ హెచ్చరించారు. నిరసన దీక్షలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, మండల అధ్యక్ష కార్యదర్శులు వసంతనాయుడు, కె.జగన్, ఉపాధ్యాయులు పాల్గున్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యసేవలు

శ్రీతానగరం : గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి పూర్తి స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవల అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని సూరంపేటలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమానికి ముందురోజే ప్రణాళిక వేసుకొని గ్రామస్తులందరికీ కార్యక్రమాన్ని తెలపాలన్నారు. వివిధ రకాల రోగులు, పిల్లలు, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన, కదల్లేని స్థితిలో ఉన్న రోగులు, సాధారణ అనారోగ్య లక్షణాలు గల వారు ఎంతమంది ఉన్నారనే నివేదికలను సిద్ధం చేసుకొంటే పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించవచ్చని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం రోగులను వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.శిరీష, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ర్యాలీ

పాలకొండ : ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని డిఎస్‌పి జివి కృష్ణారావు అన్నారు. సోమవారం పట్టణంలోని కార్గిల్ జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడంతో వారు ఇద్దరు, ముగ్గురిని బైక్‌పై ఎక్కించుకొని వాహనం నడుపుతున్నారన్నారు. మైనర్లకు వాహనాలిచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ ర్యాలీలో సిఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నవోదయలో తిరుమల సాయి విద్యార్థినికి సీటు

జియ్యమ్మవలస : జవహర్ నవోదయ 9తరగతి ప్రవేశ పరీక్షలో నవోదయ సీటు లభించింది. తిరుమల సాయి హైస్కూల్ నవోదయ కాన్సెప్ట్ లో చదువుతున్న అల్లువాడకు చెందిన బొంగు కుసుమ జవహర్ నవోదయలో 9 తరగతి ప్రవేశం పొందినది. ఉమ్మడి జిల్లా జవహర్ నవోదయలో తిరుమల సాయి నవోదయ కాన్సెప్ట్ అగ్ర స్థానంలో ఉంది. ఈ మేరకు కుసుమను పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరశకుమార్, ప్రధానోపాధ్యాయులు కర్రి శ్రీరామ్మూర్తి అభినందించారు.

టిటిడిలో గంజాయి అమ్మకాలు దారుణం

పాలకొండ : తిరుమల-తిరుపతి దేవస్థానం ప్రస్తుత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రమాదంలో పడిందని టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిటిడి కాంట్రాక్టు కార్మికుడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారని, మొత్తం 11 మంది స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. దేశంలో పేరుగాంచిన దేవాలయంలో మాదక ద్రవ్యాల కొనుగోలు జరగడం పూర్తి ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యాన్ని ఎగుమతి చేసిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు జగన్ హయాంలో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు నిలయంగా మారిందని, రాష్ట్రంలో డ్రగ్స్ వాడకానికి నిరుద్యోగమే ప్రధాన కారణమని, పనిలేని యువత, భవిష్యత్తుపై ఆశలు కోల్పోయి డ్రగ్స్, మద్యానికి బానిసలై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పన్నుల వసూళ్లలో రెవెన్యూ అధికారులు

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ పరిధిలో గల 30 వార్డుల్లో నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఖాళీస్థలాల పన్నుల పాత బకాయిలు పేరుకుపోయిన ఉన్న యజమానులకు ఈనెల 31లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వము ప్రకటించిన నేపథ్యంలో పన్నుల వసూలు శత శాతం లక్ష్యాన్ని సాధించేందుకు మూడు రోజులే గడువు ఉండడంతో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు సోమవారం పలువురు బకాయిలు ఉన్న యజమానుల వద్దకు మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.వినయ్ కుమార్ సచివాలయం అడ్మిన్ సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు, నేరుగా వెళ్లి నగదు రూపంలోను, చెక్కుల రూపంలో పన్నులను కట్టించుకుంటున్నారు.

దళిత క్రిస్టియన్స్ ఎస్‌సి హోదాకు కృషి

సీతానగరం : రాష్ట్రంలో దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించేందుకు లక్ష్మణ ఎస్‌సి కమిషన్ రాష్ట్ర సభ్యులు ఎన్.జమని తెలిపారు. దళిత క్రిస్టియన్స్ కోసం వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని, ఎంతోమంది దళిత క్రిస్టియన్లు రుణపడి ఉంటారని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి దళిత పేదలకు అనేక మేలు చేస్తున్నారన్నారు, ఆయన వెంట ఉండేందుకు అంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

ఎస్‌టి ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

సీతంపేట : బోయ, వాల్మీకులను ఎస్టీల్లో కలపాలని అసెంబ్లీ తీర్మానం చేసిన నేపథ్యంలో ఎస్‌టి ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ఈ తీర్మానం చేయడం ద్వారా సిఎం జగన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజనులకు తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. ఈ తీర్మానం చేసేటప్పుడు వైసిపి గిరిజన ఎమ్మెల్యేలు వ్యతిరేకించాలని సరికాక, కనీసం నోరు మెదపలేదని ఆక్షేపించారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజనుల బతుకులు ప్రశ్నార్థకమయ్యాయన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో కలపడం ద్వారా గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఉన్నా సిఎం జగన్‌రెడ్డికి భజనలు చేయడం తప్ప గిరిజనులకు ఉపయోగం లేదని ధ్వజమెత్తారు.



ఎమ్‌డి లక్ష్మీశాకు వినతిని అందజేస్తున్న డైరెక్టర్ లతామాణిక్యం, చంద్రశేఖర్

పెండింగు బిల్లులు చెల్లించాలి

వీరఘట్టం : మండలంలో గృహ నిర్మాణ పెండింగ్ బిల్లులతో పాటు కొత్తగా ఇళ్ళు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ భోగి లతామాణిక్య చంద్రశేఖర్ సోమవారం మంగళగిరిలో హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశాకు వినతిని అందజేశారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లింపులతో పాటు కొత్తగా గృహాలను మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు.

ప్రజలకు దూరమవుతున్న రంగస్థలం

జియ్యమ్మవలస : రంగస్థలం నానాటికి ప్రజలకు దూరమవుతుందని అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు అన్నారు. ప్రపంచ రంగస్థలం దినోత్సవం సందర్భంగా సోమవారం పెదమేరంగిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కళలు అంతరించిపోతున్నాయని, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపేందుకు అలసట నుంచి సేద తీరేందుకు ప్రతి గ్రామాన కళాకారులు రాత్రి వేళల్లో తమ కళలను ప్రదర్శించే వారన్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదని పెరుగుతున్న విష సంస్కృతితో ప్రజల ఆలోచనల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. టెలివిజన్, మొబైల్ ఫోన్లు వచ్చినాకలపై ప్రజలకు పత్యాసాన్ని పట్టించి రంగస్థలం కళాకారులను దూరం చేస్తున్నాయన్నారు. రంగస్థలాన్ని కళాకారులను కాపాడుకోవాలని అందుకోసం నిరంతరం ఎపికెఎస్ కృషి చేస్తుందని అన్నారు. కళాకారులు ఐక్యంగా ఉండి రంగస్థలాన్ని అభివృద్ధి కృషి చేయాలని వాసుదేవరావు కోరారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

బిజెపి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ సమావేశం సందర్భంగా చలో ఢిల్లీ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరప తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బి.అమరవేణి, కార్యదర్శి కాద రాము, వివిధ రంగాల నాయకులు ఎ.లక్ష్మణరావు, ఎం.వీర నాయుడు, వై.శ్రీనివాసరావు, సిహెచ్ సంజీవి, జి.జెస్సి బాయ్, ఎ.పద్మావతి, బి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ : కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

పార్వతీపురం టౌన్ :ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ పిలుపు నిచ్చారు. సోమవారం మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా ప్రదర్శన చేసి చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, జలగడగుల సత్యరాజు, గుంట్రెడ్డి గయ్యలు, మంగళగిరి శ్రీను, గుంట్రెడ్డి గంగరాజు, నాగవంశం శివ, పరిమిక హరి, పడాల ఆనంద్, పరిమిత సుజాత, గుంటరెడ్డి లక్ష్మి, పడాల నరేష్, పడాల సంతు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

జీతాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో పనిచేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు సమక్షంలో సోమవారం ఎంపిడిఒ ఎ.భానుమూర్తికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ 12నెలలుగా పని చేయించుకొని జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని ఈ వృత్తిలో బడుగు, బలహీన, దళిత వర్గాల పేద ప్రజలు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని, వీరికి నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించుకోవడంలో ఉన్న ఆసక్తి అధికారులకు, నాయకులకు జీతాలు చెల్లించడం లేదని ఆయన అన్నారు. తక్షణమే 12 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో సంబంధిత కార్యాలయాన్ని గ్రీన్‌అంబాసిడర్లచే ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంటనే ఎంపిడిఒ స్పందించి గ్రీన్ అంబాసిడర్ జీతాలు చెల్లించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



నివేదికను వివరిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యుడు

మొక్కలు పునరుద్ధరించకపోతే రికవరీ

సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఎపిడి

ప్రజాశక్తి - భామిని

వెన్యూ ప్లాంటేషన్ కింద మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటకుండా నిధులు స్వాహా చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు తక్షణమే మొక్కలు వేయాలని, లేకుంటే రికవరీ తప్పదని డ్వామా ఎపిడి శ్రీహరి హెచ్చరించారు. మండలంలో 2021-22లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై ఇటీవల సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ నివేదికపై సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఉపాధిహామీ కింద 939పనులను రూ.9కోట్ల 32 లక్షలతో చేపట్టారు. ఈ సామాజిక తనిఖీల్లో వెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం ద్వారా వివిధ పంచాయతీ నాటిన 8,848 మొక్కలు పూర్తి స్థాయిలో కనుమరుగు అయ్యాయని, కొన్ని పంచాయతీల్లో జాబ్ కార్డు అప్డేట్ చేయలేదని అన్నారు. కొన్ని పనులు జరగకుండా లైవ్‌లో చూపరాదని, మస్తర్ సీట్లులో దిద్దుబాటు ఉందని, వేతనదారులు కొన్ని పని వివరాలు మరిచి పోయమని సమాధానం ఇస్తున్నారని తనిఖీ బృందం తెలిపింది. అనంతరం ఎపిడి శ్రీహరి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎపిఒ తనిఖీ చేసినప్పుడు మస్తర్ ఉన్న వేతనదారుడు ఉన్నాడో లేడో పరిశీలించాలని సూచించారు. టిఎలు తప్పనిసరిగా ముందస్తు కొలతలు ఇవ్వాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జాబ్ కార్డు అప్డేట్ త్వరితంగా జరగాలని, వెన్యూ ప్లాంటేషన్ ద్వారా నాటిన మొక్కలు పునరుద్ధరించాలని, నాటిన మొక్కలు రోడ్డు విస్తరణలో గాని, వివిధ కారణాల వల్ల చనిపోతే సరైన కారణాలు ఆధారాలతో తెలపాలని, లేకుంటే రికవరీ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.కృష్ణారావు, ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైస్ ఎంపిపి-2 మజ్జి మోహన్ బాబు, ఎపిఒ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకిలను ఎస్‌టిలో చేర్చొద్దు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టిలో చేర్చాలని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రద్దు చేయాలని రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం స్థానిక రైతు కూలీ సంఘం కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం పిఒ విష్ణుచరణ్‌కు వినతి అందించారు. అనంతరం రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే తీర్మానం చేయడం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగమేనన్నారు. గిరిజన సంఘాలు, గిరిజనులతో కనీసం చర్చలు అయినా చేయకుండా తీర్మానాన్ని ప్రవేశపెట్టడం రాజ్యాంగాన్ని చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని, జీవో 3ను పునరుద్ధరించాలని అనేక మార్లు కోరినా కనీసం పట్టించుకోని ప్రభుత్వాలు ఇప్పుడు హడావిడి తీర్మానాలు ప్రవేశపెట్టడం ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం తన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే గిరిజనుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు హిమరిక మిన్నారావు, నాయకులు, విశ్వేశ్వరం, చిన్నప్ప, కొర్రా గోపాలం, దాసరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ద్రోహం తలపెట్టే ఆలోచన విరమించుకోవాలి

గిరిజనులకు ద్రోహం తలపెట్టే పనులు ముఖ్యమంత్రి విరమించుకోవాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని లిడికివలసలో గిరిజన సంఘాల నాయకులు, గిరిజన ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఉర్లక నాగార్జున మాట్లాడుతూ బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలోకి చేర్చడం వల్ల గిరిజనులు అనేక రకాలుగా నష్టపోతారని, రాజకీయ రిజర్వేషన్లు గాని, ఉద్యోగ రిజర్వేషన్లు గాని ఇప్పటికే అందడంలేదని అన్నారు. అలాగే గిరిజనులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ పరంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఓట్లు కోసం జగన్మోహన్‌రెడ్డి వేరే కులాల్ని గిరిజనుల్లో కలపడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని అన్నారు. రాజ్యాంగపరమైన గిరిజన హక్కులు కలరాస్తూ బోయ, వాల్మీకి కులస్తులు మైదాన ప్రాంతంలో ఉండి, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, అటువంటి కులాల్ని గిరిజనుల్లో కలపడం ముమ్మాటికీ గిరిజనులకు అన్యాయం చేయడమేనని స్పష్టం చేశారు. ఈ తీర్మానంపై పున :పరిశీలన చేయకపోతే భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు మర్రి సీతారాం దొర, గోచెక్క ఎంపిటిసి వాటక సుందరరావు, గిరిజనులు జన్ని నాగభూషణ రావు, నాసిక వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, గంపస్వామి, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట : మండలంలోని గురండి, రాజుగాడిగూడ గ్రామాల్లో మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ పి.రంగలక్ష్మి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల28 సాయంత్రం ఐదు గంటలకు సిడిపిఒ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

యుద్ధ ప్రాతిపదికను రహదారి పనులు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తర్ణ పనులు యుద్ధ ప్రాతిపాదికన చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం గ్రామ పెద్దలు పూజా కార్యక్రమం నిర్వహించి పనులు ప్రారంభించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా నాలుగు మీటర్ల పొడవున తవ్వకాలు జరుపుతున్నారు. ఈ పనులు ప్రారంభించడంతో మండల ప్రజలు ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు. మే 7, 8, 9 తేదీల్లో పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా చేస్తున్న గుత్తేదారుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఈ వేసవిలో నియోజకవర్గంలో నీటిఎద్దడి లేకుండా, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మండలంలోని జమదాల సచివాలయం పరిధిలోని జమ్మిడివలసలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు తమ గ్రామంలోని రెండు బోర్లు పనిచేయడం లేదని తెలపడంతో అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి మరమ్మతులు నిర్వహించారు. అలాగే గ్రామస్తుల కోరికపై రచ్చబండకు నిధులు కేటాయించి, పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగరేవతి, గ్రామసర్పంచి రాజేంద్రకుమార్, మండల పార్టీ కన్వీనర్ బొమ్మిరమేష్, నాయకులు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, గురురాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్తులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సాలూరు : సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించారు. మధ్యాహ్నం 3గంటలకు మండలంలోని కొత్తవలస పంచాయతీ పరిధిలో గల కోదు కరడవలస, గదబ బొడ్డు వలస, పిఎన్ బొడ్డు వలసలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ప్రారంభంలోనే భారీగా వర్షం పడినప్పటికీ గ్రామస్తులు రాజన్నదొరకు మేళతాళాలతో సర్పంచ్ ఎన్.ధర్మావతి, వైసిపి నాయకులు కళ్యాణ్, సచివాలయం కన్వీనర్ ఎస్.జయసింహ ఆధ్వర్యాన ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఎంపికొ పార్వతి, ఎపిఎం సింహాచలం, ఎపిఒ కృష్ణారావు పాల్గొన్నారు.



రోగులకు అన్నదానం చేస్తున్న దాతలు

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లిలో గల మహాత్మా గాంధీ మెమోరియల్ లెప్రసీ హాస్పిటలో సోమవారం రోగులకు పెదపెంకికి చెందిన ఈర్ల సంజీవనాయుడు, కుటుంబ సభ్యులు అన్నదాన నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ తన తల్లి ఈర్ల సత్తెమ్మ జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని తమ కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులు శివ అప్పారావు మూర్తి, రోగులు సంజీవ నాయుడు కుటుంబానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెంటమనాయుడు, సింహాచలం, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాలు వేలం

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నాటు సారాతో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు ఈనెల 28న వేలం వేస్తున్నట్లు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

సంపద కేంద్రాల నిర్వహణపై నేటి నుంచి శిక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ఈనెల 28,29 తేదీల్లో గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీసర్పంచులకు, కార్యదర్శులకు, ఇంజినీరింగ్, వ్యవసాయశాఖ, వెటర్నరీ సహాయకులకు మండలంలోని పెదబోగిలి చెత్త సంపద కేంద్రం వద్ద శిక్షణ నిర్వహించనున్నట్లు డిపిఒ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని లచ్చయ్యపేట గ్రామ పంచాయతిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్తను తరలిస్తున్న హరిత రాయబారులకు పంచాయతీల నుండి 15వ ఆర్థిక సంఘం డబ్బులు చెల్లించాలని కోరారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఇంటి పన్నులు రూ.4కోట్ల 86లక్షల వసూళ్లకు గానూ కేవలం రూ.కోట్ల 2లక్షల రూపాయలు వసూలు చేశారన్నారు. పెదబోగిలిలోని చెత్తసంపద కేంద్రం నిర్వహణ, వానపాముల పెరుగుదల, వ్యర్థ పదార్థాలతోను, చెత్తతో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువులపట్ల, వర్మీ ఉత్పత్తిని గమనించి అన్ని గ్రామాల్లో ఇలాగే చెత్త సంపద కేంద్రాలను తీర్చిదిద్దాలని కోరారు. స్వమిత్వ సర్వేలో భాగంగా గ్రామాల్లో ఉండే వ్యవసాయ భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ, సర్వే అధికారులు గ్రామకంఠంలో ఉండే నిర్మాణాలు, ఖాళీ స్థలాలను సర్వే చేయించడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సర్వే పూర్తయ్యాక గ్రామ కంఠంలో ఉండే వాటికి ప్రాపర్టీ కార్డులు ఇస్తామన్నారు. గ్రామాల్లో బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల వద్ద క్లోరినేషన్ చేయించాలని ఆయన తెలిపారు.



పోలమాంబను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా ఇప్పల పోలమ్మ15వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని నాయుడు వీధిలో గల ఇప్పల పోలమ్మ గ్రామ దేవత 15వ వార్షికోత్సవం వేడుకలు సోమవారం ఇప్పల పోలమ్మ గ్రామ దేవత కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణ ప్రజలు తెల్లవారు నుంచే గ్రామ దేవత గుడికి చేరుకొని పసుపు కుంకుమలతో పూజలను నిర్వహించి ఇప్పలపోలమ్మను దర్శించుకుంటున్నారు. కమిటీ ఆధ్వర్యంలో పులిహొూర ప్రసాదాన్ని గుడికి వచ్చే భక్తులకు వితరణ చేశారు. ఈ ఏడాది పండగ తేవడం జరుగుతుందని, పండగను ఏఏ తేదీల్లో తేవడం అనేది కమిటీ సభ్యులతో పాటు, పట్టణంలోని రైతులు, వ్యాపారస్తులు, ప్రముఖులతో కలిసి కూర్చొని త్వరలో నిర్ణయిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కుసిమి సంత వేలం పాట వాయిదా

సీతంపేట : మండలంలోని కుసిమి సంత వేలం పాట మంగళవారానికి వాయిదా వేసినట్లు ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన పాటకు వేలందారులెవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర కూర్మారావు, కార్యదర్శి రాజశేఖంపాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ ఆయా మృతి

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి నెంబర్ -2 అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా జి.అలివేలు(58) ఆదివారం రాత్రి మృతి చెందారు. తిరుపతి వెళ్తుండగా విశాఖలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమె మృతి పట్ల ఐసిడిఎస్ పిఒ విజయగౌరి, ఎసిడిపిఒ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుంతలు పూడ్చాలి

పాచిపెంట : మండల కేంద్రమైన పాచిపెంట దుర్గగుడి సెంటర్ వద్ద ఆర్ అండ్ బి రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, వీటిని తక్షణమే పూడ్చాలని సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గోతుల వల్ల వాహనచోదకులు అందులో పడి గాయాలపాలవుతున్నారని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. స్థానికులు జగ్గ్యాన రామారావు, కాల చిన్నారావు, నల్లి పోలీసు కలిసి దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు నెలల కిందట ఫైబర్ నెట్ వాళ్లు పెద్ద పెద్ద గుమ్ములు రోడ్డు పక్కన తవ్వి సకాలంలో పనులు చేయకుండా వదిలివేశారని తెలిపారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు



మృతి చెందిన మౌనిక

పిడుగుపాటుకు విద్యార్థిని మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేటలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ యువతి మృతి చెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పత్రా మౌనిక (17) తన స్నేహితురాలు కిలారి కావేరితో కలిసి కాలనీ వెనుకనున్న పొలాల్లోకి బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె స్నేహితురాలికి గాయాలు కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. మౌనిక పార్వతీపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. పరీక్షలు రాసి ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి జరిగిన ఈ ప్రమాదంలో ఆమె మరణించడం పట్ల గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మౌనిక మాజీ ఎంపిటిసి సభ్యులు పత్ర అసిరియాకు మనుమరాలు అని కుటుంబీకులు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి మహిళకు గాయాలు

కొమరాడ మండలం సుంకేసుకు చెందిన మండంగి లక్ష్మి జీడిపిక్కలు ఏరేందుకు చెట్టు ఎక్కగా అదపు తప్పి కాలు జారి పడిపోయింది. దీంతో ఆమె నడుము, పక్కటెముకలకు గాయాలయ్యాయి. స్పందించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

బైకు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

కొమరాడ మండలం బొడ్డవలసకు చెందిన పువ్వల రాము, కద్రక జనార్ధన్ ఆదివారం రాత్రి బైక్‌పై జంఝావతి కూడలికి వెళ్లి, రాయగఢ నుంచి వచ్చిన తమ మిత్రుడు అఖిల్‌ను బండిపై ఎక్కించుకుని తమ గ్రామానికి తిరుగు ప్రయాణంలో అజాగ్రత్తగా బైక్‌ను నడుపడం వల్ల వాహనం బోల్తా కొట్టడంతో ముగ్గురుకి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన గ్రామస్తులు వారిని ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.